క్లుప్తంగా

పరిశోధనలపై దృష్టి సారించాలి



జీడిమెట్ల: విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు పరిశోధనలపై దృష్టి సారించాలని సుభాష్‌నగర్ వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం పాఠశాలలో సైన్స్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా సైన్స్‌ఫెయిర్‌ను ప్రారంభించిన శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ సైన్స్ షోలతో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత బయటకు వస్తుందన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు తయారు చేసిన నమూనాలను ప్రదర్శించారు. భూగోళం, పాలపుంత, శరీర అవయవాల పనితీరు, న్యూటన్స్ లా, గణితశాస్త్రానికి సంబంధించిన నమూనాలు తయారు చేశారు. వీటిని తిలకించిన విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థుల సృజనాత్మకతను అభినందించారు.

కాలనీల అభివృద్ధికి కృషి చేయాలి

చింతల్: సంక్షేమ సంఘాలు కాలనీల అభివృద్ధికి కృషి చేయాలని చింతల్ డివిజన్ కార్పొరేటర్ రషీదాబేగం అన్నారు. శనివారం శ్రీనివాస్ నగర్ కాలనీ నూతన సంక్షేమ సంఘం సభ్యులు కార్పొరేటర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రషీదా మాట్లాడుతూ స్థానికంగా నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని, కాలనీ అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు దాసరి నర్సింగ్‌రావు, కార్యదర్శి నాగరాజు, కోశాధికారి శంకర్, నాయకులు రవీందర్, నర్సింహ, బస్వారాజు, వెంకటేష్, శ్రీనివాస్, శ్రీహరి, చిరంజీవి, ప్రతాప్, జగన్, పాండు, శ్రీను, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్టాటిక్ ట్యాంకులను వినియోగంలోకి తేవాలి



వృథాగా పారుతున్న నీరు..

రంగారెడ్డినగర్: ఒకప్పుడు నీటి అవసరాలు తీర్చిన స్టాటిక్ ట్యాంక్‌ల నిర్వహణను అధికారులు గాలికొదిలేశారు.. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో స్టాటిక్ ట్యాంక్‌లను నిర్మించి బోర్ల ద్వారా నీటిని అందించగా స్థానికులు రోజువారీ అవసరాలకు వాడుకునేవారు. ప్రస్తుతం ప్రతి ఇంటికి గోదావరి జలాల సరఫరా జరుగుతుండటంతో స్టాటిక్ ట్యాంక్‌ల అవసరం లేకుండా పోయింది. దీంతో వాటి నిర్వహణ పట్టించుకునే నాథుడే కరువయ్యారు. రంగారెడ్డినగర్ డివిజన్, నందానగర్‌లోని పెంటెకోస్ట్ చర్చి రోడ్డులో ఉన్న స్టాటిక్ ట్యాంక్ ప్రతి రోజు నిండటం, ఈ నీరంతా రోడ్డుపై వృథాగా పోవడం పరిపాటిగా మారింది.. స్టాటిక్ ట్యాంక్‌కు ఉన్న నల్లాలు తప్పు పట్టి నిరుపయోగంగా మారాయి. ప్రజలు వినియోగించుకోకపోయినా సదరు స్టాటిక్ ట్యాంక్‌కు అనుసంధానం చేసిన బోరు ఆన్ కావడంతోనే భూగర్భ జలాలతో పాటు విద్యుత్ వృథా అవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నీటిని దుర్వినియోగం కాకుండా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

మ్యాన్‌హోళ్లపై అధికారులకు సమాచారం ఇవ్వాలి

కూకట్‌పల్లి: ప్రమాదాలకు కారణమవుతున్న మ్యాన్‌హోల్ కవర్లు తెరిచి ఉంచినట్లు గుర్తిస్తే జోనల్ కమిషనర్ కార్యాలయానికి లేదా సంబంధిత సర్కిల్ అధికారులకు సమాచారం అందించాలని తద్వారా ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా నివారించవచ్చునని జోనల్ కమిషనర్ వి. మమత అన్నారు. మూసాపేట డీసీ రమేష్ 7702304863, ఈఈ సత్యనారాయణ 9989930362, కూకట్‌పల్లి డీసీ కృష్ణయ్య 7337557245, ఈఈ గోవర్ధన్ గౌడ్ 9154299633, గాజుల రామారం డిసి మల్లారెడ్డి 6309529286, ఈఈ గోవర్ధన్ గౌడ్ 9154299633, కుత్బుల్లాపూర్ డిసి నాగమణి 7799910437, ఈఈ కృష్ణ చైతన్య 99701908887, అల్వాల్ డీసీ శ్రీనివాస్‌రెడ్డి 8985409173, ఈఈ కె. రాజు 8978025473 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.





మియాపూర్ డివిజన్ పరిధిలోని రోడ్ల దుస్థితి

గుంతలు.. అవస్థలు

మియాపూర్: రోడ్లపై అడుగడుగునా గుంతలు దర్శనమిస్తున్నాయి. గుంతలు పూడ్చేందుకు లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నా క్షేత్రస్థాయిలో ఫలితం కనపడడంలేదు. రోడ్ల నిర్మాణ, మరమ్మతుల సమయంలో నాణ్యత పాటించకపోవడంతో మున్నాళ్లకే గుంతలు పడుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- చందానగర్ సర్కిల్ మియాపూర్ డివిజన్ పరిధిలోని కృషినగర్, ప్రశాంత్‌నగర్, మయూరీ నగర్, లక్ష్మీనగర్, జేపీనగర్, మక్తమహబూబ్ పేట్, దీప్తీశ్రీనగర్ ప్రాంతాలలోని రహదారులకు మరమ్మతులు చేశారు. ఐతే ఇటీవల కురిసిన వర్షాలకు మరమ్మత్తులు చేసిన రోడ్లు గుంతలుగా మారాయి. గుంతలు ఏర్పడి కంకర తేలి ప్రమాదకరంగా మారాయి. రోడ్డుపై కంకర తేలడంతో వాహనదారులు ఆ రోడ్డు వెంబడి వెళ్తూ జారి పడే అవకాశం ఉంది.

గుంతలు పూడ్చేది ఇలా ..?

- రోడ్లపై గుంతలను బట్టి చతురస్రం లేదా దీర్ఘ చతురస్రాకారంలో తవ్వి వ్యర్థాలను తొలగించి అందులో కంకర మిశ్రమాన్ని వేసి సమాంతరంగా చదును చేయాలి.



- తారు, కంకర మిశ్రమం వేసే ముందు ఆ గుంతల్లో నీరు, తడి ఉండకుండా చూసుకోవాలి.
- ఈ విధంగా చేయడం ద్వారా మరమ్మతులు చేసిన చోట రోడ్డు దృఢంగా ఉంటుంది. త్వరగా పాడైపోయే అవకాశం ఉండదని సీనియర్ అధికారులు సూచిస్తున్నారు.

మరమ్మతులు చేస్తున్నారిలా ..?

- ట్రాక్టర్‌లు, ఇతర వాహనాలలో తారు, కంకర మిశ్రమాన్ని తీసుకొస్తున్నారు. ముగ్గురు కార్మికులు వచ్చి రోడ్డు వెంబడి కనిపించిన గుంతలలో తారు, కంకర మిశ్రమాన్ని కుప్పలుగా వేసి పూడ్చేస్తున్నారు.



- తర్వగా చదును చేయడానికి కాళ్లకు ఉన్న బూట్లతో లేదా చెప్పులతో, వెంట తీసుకొచ్చిన పార సహాయంతో చదును చేసి వదిలేస్తున్నారు.
- గుంతలలో నీళ్లు ఉన్న కూడా అలాగే కంకర మిశ్రమాన్ని వేస్తున్నారు. ఇలా చేయడం వల్ల వర్షం వచ్చినా, పెద్ద పెద్ద వాహనాలు వాటిపై నుండి వెళ్లడంతో మరమ్మతులు చేసిన గుంతలు కంకర తేలిపోతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.
- ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలనకు రాకపోవడం, కిందిస్థాయి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనుల్లో నాణ్యత లేక గుంతలు పడుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



సమస్యలు వింటున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు..

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తాను ఎప్పుడు సిద్ధంగా ఉంటానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు శనివారం శంభీపూర్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీని కలిసి స్థానికంగా నెలకొన్న సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత అధికారులకు ఫోన్‌లు చేసి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఏ కష్టమొచ్చినా తాను అందుబాటులో ఉంటానని, ప్రజాశ్రేయస్సే పరమావధిగా ముందుకు సాగుతున్నామన్నారు. తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా మూడోసారి సీఎంగా కేసీఆర్‌ను దీవించాలన్నారు.

ఘనంగా త్రైలోక్య మోహన చండీ హోమం



హోమంలో పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: రాష్ట్ర కార్మిక శాఖామంత్రి సీహెచ్ మల్లారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీ అగ్రికల్చర్ కళాశాల ప్రాంగణంలో కుటుంబ సమేతంగా ఆయన త్రైలోక్య మోహన చండీ హోమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వివేకానంద్ మంత్రి మల్లారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

రంగారెడ్డినగర్: ప్రతిరోజు పాఠాలు బోధిస్తూ బిజీగా ఉండే ఉపాధ్యాయులు ఆడిపాడారు. క్లాసులు వినే విద్యార్థులు ఉపాధ్యాయుల అవతారమెత్తారు. ఇందుకు చింతల్ నందానగర్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వేదికగా మారింది. శనివారం పాఠశాలలో టీచర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులను విద్యార్థులు శాలువాలు, బహుమతులతో సత్కరించారు. స్వయంపరిపాలనా దినోత్సవంలో భాగంగా విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్ర పోషించారు. అనంతరం పాఠశాలలో టీచర్స్‌కు ఆటల పోటీలు నిర్వహించారు.

హైటెక్స్‌లో ప్రారంభమైన బీఎన్ఐ గోనాట్–2023



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బీఎన్ఐ జాతీయ డైరెక్టర్ హేము సువర్ణ తదితరులు

మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో శనివారం బీఎన్ఐ (బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్) గోనాట్ 2023 కార్యక్రమాన్ని బీఎన్ఐ జాతీయ డైరెక్టర్ హేము సువర్ణ ప్రారంభించారు. బీఎన్ఐ హైదరాబాద్ రీజియన్ 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రెండురోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సెమినార్‌లో వ్యాపార దిగ్గజాలు, వక్తలు తమ అనుభవాలను పంచుకున్నారు. ఐడియల్ ఇన్సూరెన్స్ డైరెక్టర్ ఆయూస్ బన్సాల్, బీఎన్ఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్స్ ప్రసంగించారు. ఈ సందర్భంగా పలు ఉత్పత్తులను ప్రారంభించారు. 200 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కామధేను ఎస్టేట్స్ పార్ట్‌నర్ స్వాతి, పెర్సమ్ డైరెక్టర్ టి.రాధాకృష్ణ, బాడీ ట్రాన్స్‌ఫార్మేషన్ కోచ్ దీపిక చలసాని, సీలింగ్ క్రూ పార్టనర్ మయాంక్ హరోడియా, శ్రీ అదిత్య వర్షిణీ ఎస్టేట్స్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో 'లేక్ క్లీన్ అప్ డ్రైవ్'

రాయదుర్గం: నిత్యం కంప్యూటర్లు..పుస్తకాలతో కుస్తీలు పట్టే విద్యార్థులు కాస్తా వీకెండ్స్‌లో సేవా దృక్పథాన్ని చాటుతూ 'లేక్ క్లీన్ అప్ డ్రైవ్' చేపట్టారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని ఎన్ఎస్ఎస్ సెల్ విభాగం, హెచ్‌సీయూ పారిశుద్ధ్య విభాగం సంయుక్త ఆధ్వర్యంలో వైట్‌రాక్స్, చెరువు వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, వ్యర్థాలు, చెత్తాచెదారం తొలగించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ బి కృష్ణయ్య, ప్రోగ్రామ్ ఆఫీసర్ భీంసింగ్ మాట్లాడుతూ వైట్‌రాక్స్ వద్ద ఉన్న స్థలాన్ని దుర్వినియోగం చేయడం వల్ల క్యాంపస్ అటవీ ప్రాంతంలోని జంతువులు, పక్షులు గాయపడతాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ శానిటేషన్ విభాగం అధికారులు వెంకటదాస్, జునైద్, సోనీ, నితిన్, అభిలాష్, శంకర్‌నాయక్ బృందం, ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల బృందం పాల్గొన్నారు.



యువకుడికి దేహశుద్ధి



నాగేంద్ర చారి (ఫైల్)

జగద్గిరిగుట్ట: కాలనీలోని మహిళల ఫొటోలు తీసి వారిపై అసత్య ప్రచారం చేస్తున్న యువకుడికి కాలనీ వాసులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప సముదాయంలో ఉంటున్న నాగేంద్రచారి మహిళల ఫొటోలు తీసి వాటిని వ్యభిచార కేంద్రాల నిర్వాహకులకు పంపేవాడు. దీనిని గుర్తించిన కాలనీ వాసులు శనివారం అతడిని పట్టుకుని చితకబాది పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



నాగేంద్ర చారికి దేహశుద్ధి చేస్తున్న మహిళలు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు



రంగారెడ్డినగర్: కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలందిస్తున్నామని షాపూర్‌నగర్ అర్బన్ హెల్త్‌సెంటర్ ఇన్‌చార్జి డాక్టర్ నవనీత అన్నారు. ఎనిమిది గర్భిణులకు షాపూర్‌నగర్ యూపీహెచ్‌సీ వైద్యులు శనివారం సాధారణ ప్రసవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నవనీత మాట్లాడుతూ తల్లి, బిడ్డలు ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం తరపున వారికి కేసీఆర్ కిట్లను అందించామని, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

నిజాంపేట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతర పోరాటాలు నిర్వహిస్తున్నట్లు సీపీఎం నిజాంపేట్ రాజీవ్‌గృహకల్ప కార్యదర్శి బాలపీరు అన్నారు. శనివారం సీపీఎం ఆధ్వర్యంలో నిత్యావసరాల ధరలపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల పాలనలో నిత్యవసరాల ధరలు రెండింతలు పెరిగాయని, సామాన్యుడు ఇంటి అద్దె చెల్లించని పరిస్థితి నెలకొందన్నారు. అధికారంలోకి వస్తే ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేస్తామన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీలను అమలు చేయలేదని ఆరోపించారు. ప్రభుత్వ భూముల్లో పేదల ఇళ్లను కూల్చివేసే అధికారులు బడాబాబుల కట్టడాల జోలికి వెళ్లడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో సుజాత, వీరయ్య, రమేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత చీరలతో హుందాతనం

బంజారాహిల్స్: భారతీయ సంస్కృతిలో చేనేత వస్త్రాలకు ఎంతో ప్రత్యేకత ఉందని ప్రముఖ యాంకర్ సుమ కనకాల అన్నారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టులోని జూబ్లీక్రాస్‌లో జీటీ వీవ్స్‌లో మనోహరి ఫెస్టివల్ కలెక్షన్స్‌ను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... చేనేతకు ఎప్పుడూ వన్నె తగ్గలేదని నేటి తరం వారు ఎంతో ఇష్టంగా వాటిని ధరిస్తున్నారని అన్నారు. చేనేత అమ్మ చల్లని ఒడిని తలపిస్తుందన్నారు. చేనేత చీరలు మగువల హుందాతనాన్ని మరింత పెంచుతాయని అన్నారు.



లక్ష్యసాధనకు చిత్తశుద్ధితో కృషి చేయాలి

- విద్యార్థులకు ఆంగ్లభాషపై పట్టు ఉండాలి
- రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఏకె ఖాన్



ఏకెఖాన్‌ను సన్మానిస్తున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్

రాయదుర్గం: విద్యార్థులు ఒక లక్ష్యంను ఏర్పరుచుకుని దాని సాధనకు చిత్తశుద్ధితో కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఏకెఖాన్ సూచించారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోయూజీసీ సూచనలపై ఆఫీస్ ఆఫ్ ది డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో కొత్త విద్యార్థుల కోసం ప్రత్యేకంగా 'దీక్షారంభ్: స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రామ్' (ఎస్ఐపీ) కార్యక్రమాన్ని నిర్వహించింది.అందులో భాగంగా ' ది ఆర్ట్ ఆఫ్ గోల్ సెట్'అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఆంగ్ల భాషపై పట్టు ఉండాలని సూచించారు. సింబయాసిస్ కళాశాల న్యాయ విభాగాధిపతి డాక్టర్ అనితాసేబుల్ లింగం, చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉర్దూ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్‌కే ఇష్తియాక్ అహ్మద్, అడ్మిషన్స్ డైరెక్టరేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం వనజ, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ అలీమ్ అష్రఫ్ జైసీ, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ శనివారం పూజలు

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ మెట్టుకాని గూడలోని శ్రీనల్లగుట్ట లక్ష్మి నరసింహస్వామి దేవాలయంలో శ్రావణమాసం ఆఖరి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారిని ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఇంద్రసేన గుప్త, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



స్వామివారిని ఊరేగిస్తున్న దృశ్యం

అన్నమయ్యపురంలో నృత్యార్చన



మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం స్వరార్చనలో భాగంగా డాక్టర్ శోభరాజు శిష్యబృందం శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్రమ్, శ్రీలక్ష్మీ అష్టోత్తర శత నామ స్తోత్రమ్, శ్రీ అన్నమాచార్య అష్టోత్తర శతనామావళి , గురుస్తుతితో ప్రారంభించారు. నృత్యజ్యోతి కూచిపూడి అకాడమీ గురువు మాధవి శిష్యబృందం వినాయకకౌతం, రాజశ్రీ శబ్దం, రామాయణ శబ్దం, త్యాగరాజ కృతి, మైసూరు వాసుదేవాచారి కీర్తన, దశావతార శబ్దం, గోపికృష్ణ రూపకంతో సందర్శకులను అలరించారు. కళాకారులు తనిష్క, హంసిని, యశ్విత, హిమశ్రీ, తపస్య, ఆర్షతి, శ్రేష్టలు పాల్గొన్నారు. అనంతరం కళాకారులను ఘనంగా సత్కరించారు.

అందరూ చూస్తుండగానే.. చెరువులో దూకిన వ్యక్తి

కొనసాగుతున్న గాలింపు



దస్తగిరి కుంట వద్ద గాలింపు చేపడుతున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం

నిజాంపేట్: అందరూ చూస్తుండగానే ఓ వ్యక్తి చెరువులోకి దూకి గల్లంతైన సంఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది..పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శనివారం రాత్రి సైకిల్‌పై వచ్చిన ఓ వ్యక్తి నిజాంపేట్‌లోని దస్తగిరి కుంటలో దూకేశాడు. దీంతో అక్కడే ఉన్న ప్రజలు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం, బాచుపల్లి పోలీసులు సదరు వ్యక్తి కోసం గాలింపు చేపట్టారు. చెరువులోకి దూకిన వ్యక్తి ఎవరు.. అసలెందుకు ఆత్మహత్యకు పాల్పడ్డాడన్న విషయాలు తెలియాల్సి ఉంది.

గుంజ శ్రీనివాస్‌కు కుత్బుల్లాపూర్ టికెట్ ఇవ్వాలి



కాంగ్రెస్ అధిష్టానానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంఘాల వినతి

హిమాయత్‌నగర్: వడ్డెర సామాజిక వర్గానికి చెందిన గుంజ శ్రీనివాస్‌కు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే టికెట్‌ను కేటాయించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నేతలు కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని కోరారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడిగా, అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న గుంజ శ్రీనివాస్ గత 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీతో పాటు పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో నిర్వహించిన సమావేశంలో దళిత సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు జె.బి. రాజు, జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షులు వేముల వెంకటేష్, ప్రముఖ కార్మిక నేత గొల్లపల్లి దయానంద్, దళిత సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ బి. సంజీవ రావు, మైనారిటీ సంఘం నేత ఎం. ఏ. హమీద్ ఆయనకు మద్దతుగా నిలిచారు. శ్రీనివాస్‌కు టికెట్ కేటాయిస్తే తామంతా ముందుండి గెలిపించి తీరుతామన్నారు.

అప్రమత్తతతోనే వ్యాధుల నివారణ

కుత్బుల్లాపూర్: వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటే వ్యాధులు దరి చేరవని, ఇంటి ముందు నీరు నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటే డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులను అరికట్టవచ్చని కుత్బుల్లాపూర్ అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ ఉమారాణి అన్నారు. సర్కిల్ పరిధిలోని పలు కాలనీల్లో శనివారం యాంటీ లార్వా ఆపరేషన్ నిర్వహించారు. దాదాపు 80 మంది సిబ్బందితో జీడిమెట్ల, రంగారెడ్డినగర్, కుత్బుల్లాపూర్, సుభాష్ నగర్ డివిజన్లలో నిల్వ ఉన్న నీటిలో యాంటీ లార్వా ముందును పిచికారి చేశారు. ఈ సందర్భంగా ఉమారాణి మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్నందున ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి తొలగించాలని సూచించారు. టెర్రస్ పైన, పూల మొక్కల కోసం ఏర్పాటుచేసిన కుండీల్లో నీరు ఉండకుండా ఎప్పుడు డ్రైగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి ఆదివారం పది నిమిషాలు కేటాయించి ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవాలని, తద్వారా అంటురోగాలు వ్యాప్తి చెందకుండా కట్టడి చేయవచ్చని తెలిపారు. కూకట్‌పల్లి జోనల్ సీనియర్ ఎంటమాలజిస్ట్ సంధ్య ఆదేశాల మేరకు ప్రతి డివిజన్‌లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



యాంటీ లార్వా మందు పిచికారీ చేస్తున్న దృశ్యం